సాక్షి నిజామాబాద్

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025





## వైభవంగా కల్యాణం..

నిజామాబాద్ మండలం మల్కాపూర్ (ఏ)లో అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- 8లో ▸



## విషాదాన్ని మిగిల్చిన..

బైక్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు స్నేహితులు మృతి చెందారు. తిమ్మాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

37.5 /13.8

## వాతావరణం

ఉదయం చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### డీపీవో శ్రీనివాస్ బదిలీ

- కామారెడ్డి నుంచి జిల్లాకు రానున్న శ్రీనివాస్‌రావు

**సుభాష్‌నగర్:** జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం శ్రీనివాస్ బదిలీ అయ్యారు. మూడురోజుల క్రితమే పూర్తి స్థాయి బాధ్యతలు తీసుకున్న శ్రీనివాస్‌ను జగిత్యాల జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో కామారెడ్డి డీపీవో శ్రీనివాస్‌రావు బదిలీపై రానున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం నూతన డీపీవో బాధ్యతలు చేపట్టనున్నారు.

### భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**బాల్కొండ:** సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థల భవన నిర్మాణం కోసం మెండోరా మండలం పోచంపాడ్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూమిని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం పరిశీలించారు. ఒకేచోట 25 ఎకరాల స్థలం అవసరం ఉన్న నేపథ్యంలో స్థలానికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్‌ఐ వేణుగోపాల్, సర్వేయర్ మమత తదితరులు ఉన్నారు.

### పసుపునకు రూ.17వేల మద్దతు ధర ఇవ్వాలి



**ఆర్మూర్‌టౌన్:** కేంద్ర ప్రభుత్వం పసుపు పంటకు రూ.17వేల మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం పలువురు రైతులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. ప్రస్తుతం పుసుపు క్వింటాల్ ధర రూ.11 వేలు ఉందని, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, మెట్‌పల్లి, నిర్మల్ ప్రాంత రైతులు దీక్షకు మద్దతు తెలపాలని కోరారు. దీక్షలో అంకాపూర్‌కు చెందిన వినోద్‌రెడ్డి, లక్కారం గ్రామానికి చెందిన నక్కల రాములు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**సుభాష్‌నగర్ :** నగరంలోని వినాయక్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్–3 ఏడీఈ వీరేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. పద్మానగర్ రోడ్‌నెంబర్–1, హనుమాన్‌నగర్, యాదగిరిబాగ్, త్రిమూర్తిరోడ్, కోటగల్లీ, జెండాగల్లి, నకాశ్‌గల్లీ, షాదుల్లా దర్గా, ఆర్య సమాజ్ రోడ్, సిర్నాపల్లిగడి బజార్, దోబీ ఘాట్, గోసంగికాలనీ, శివాలయం ఏరియా, తెలంగాణతల్లి విగ్రహం తదితర ప్రాంతాలకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

# అక్రమాలకు అధికారుల వెన్నుదన్ను

పది ఎకరాల అసైన్డ్ భూమిలో మెటల్ క్వారీ..

70వేల క్యూబిక్ మీటర్ల మెటల్ తవ్వేందుకు అనుమతులు.. ఇప్పటి వరకు తవ్వింది 10లక్షల క్యూబిక్ మీటర్లు. ఆ పక్కనే ఐదెకరాల ప్రభుత్వ భూమిలో సాఫీగా కొనసాగుతున్న స్టోన్ క్రషర్.. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేదు. మైన్స్, జియాలజీ, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. క్రషర్ కొనసాగుతోంది ప్రభుత్వ భూమిలోనేనని, నాలా కన్వర్షన్ ఇవ్వడం కుదరదంటున్న రెవెన్యూ అధికారులు.. అక్రమార్కులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుపుతున్నారు. ఓ వైపు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా, మరోవైపు జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్ శివారులో క్రషర్ సాఫీగా కొనసాగుతోంది.

జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్ వద్ద అక్రమంగా కొనసాగుతున్న స్టోన్ క్రషర్



### విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి ఫిర్యాదు

అక్రమ వ్యవహారాలను అడ్డుకోకుండా జిల్లా యంత్రాంగం అవినీతిమయమైందని జిల్లాకు చెందిన కేఆర్ సుదర్శన్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. అసైన్డ్ భూమిని క్వారీ కోసం లీజుకివ్వడంతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో క్రషర్ ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు సుదర్శన్‌రెడ్డి తాజాగా ఘాటైన లేఖ రాశారు. జిల్లా యంత్రాంగం అసమర్థ, అవినీతిమయంగా మారిందని, రెండుసార్లు క్రషర్ నిర్వాహకుడు మనోహర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని ఆధారాలు ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోగా అక్రమానికి సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

- అనుమతికి మించి అనేక రెట్ల తవ్వకాలు
- మరోవైపు ప్రభుత్వ భూమిలో స్టోన్ క్రషర్ నిర్వహణ
- అన్నీ తెలిసి అధికార యంత్రాంగం అపార మద్దతు
- అనుమతి 70వేల క్యూబిక్ మీటర్లకు.. తవ్వింది 10 లక్షల క్యూబిక్ మీటర్లు
- విద్యుత్ సరఫరా సైతం అక్రమ మార్గంలోనే..
- డొంకతిరుగుడు సమాధానాలు చెబుతున్న ఉన్నతాధికారులు
- సమాచారహక్కు చట్టం ద్వారా 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం అక్రమాలను అరికట్టే విషయంలో పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో మాత్రం కొందరు అధికారులు, ఉన్నతాధికారులు ఇందుకు విరుద్ధంగా అక్రమ వ్యవహారాలకు పాల్పడుతున్న వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామం వద్ద కంకర క్వారీలో తీసుకున్న అనుమతులకు మించి అనేక రెట్లు అధికంగా తవ్వకాలు చేపట్టారు. భారీ పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని బోరుబావులు దెబ్బతింటున్నాయి. పైగా ఇక్కడే ప్రభుత్వ భూమిలో అక్రమంగా స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నారు. అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వ యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలతో పలువురు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



లక్ష్మాపూర్ సమీపంలో పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే 10 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని లీజుకు తీసుకుని మెటల్ క్వారీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ 70 వేల క్యూబిక్ మీటర్ల మెటల్ తవ్వేందుకు 2015లో అనుమతులు తీసుకున్న వారు ఏకంగా 10 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా కంకర తవ్వేసినా గనుల శాఖ చర్యలు తీసుకోవడంలేదు. పర్యావరణ విధ్వంసం అవుతున్నప్పటికీ కాలుష్య నియంత్రణ అధికారులు సైతం తమకేం తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

**నాలా కన్వర్షన్ ఇవ్వడం కుదరదు..**

కేఆర్ సుదర్శన్‌రెడ్డి సమాచార హక్కు చట్టం కింద క్రషర్ అనుమతులపై పలుమార్లు అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు. 2018 ఫిబ్రవరి 9న ఆయన చేసిన దరఖాస్తుకు.. ఫిబ్రవరి 27న తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. క్రషర్ భూమికి నాలా కన్వర్షన్ ఇవ్వడం కుదరదని, చర్యలు మాత్రం తీసుకోలేదని పేర్కొన్నారు. 2021 మార్చి 2న ఎలాంటి చర్యలు తీసుకున్నారని మళ్లీ దరఖాస్తు చేయగా, 2021 మే 11న అది ప్రభుత్వ భూమేనని, నాలా కన్వర్షన్ ఇవ్వడం కుదరదని పేర్కొంటూనే ఎలాంటి చర్యలు తీసుకోలేదని తహసీల్దార్ సమాధానమిచ్చారు. దీంతో 2021 జూలై 3న ఆర్మూర్ ఆర్డీవోకు, 2022 ఫిబ్రవరి 19న ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. క్వారీకి పర్యావరణ అనుమతులు లేవని 2023 మే 16న మైన్స్, జియాలజీ ఏడీ తెలిపారు. దీనిపై 2023 ఆగస్టు 2న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మళ్లీ 2023 సెప్టెంబర్ 26న నాలా కన్వర్షన్ అనుమతి ఇవ్వలేదని మరోసారి తహసీల్దార్ సమాధానమివ్వడం గమనార్హం. ఇక క్రషర్ అనుమతుల గురించి గనుల శాఖను అడగాలని తహసీల్దార్ సమాధానం ఇవ్వడం గమనార్హం. క్రషర్ అనుమతుల అంశం రెవెన్యూ శాఖకు సంబంధించినదైనప్పటికీ ఇలా సమాధానమివ్వడం పనితీరుకు అద్దం పడుతోంది. 2023 అక్టోబర్ 9న గత 8 సంవత్సరాల నుంచి అక్రమంగా క్రషర్ కొనసాగుతున్న విషయమై సుదర్శన్‌రెడ్డి ఆర్మూర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. 2023 డిసెంబర్ 11న క్రషర్‌కు అనుమతులు లేవని, సదరు క్రషర్ నిర్వాహకుడు మనోహర్‌రెడ్డికి నోటీసులు ఇచ్చామని, ఏడు రోజుల్లో సమాధానం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సమాచారమిచ్చారు. అయితే ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ విషయాలపై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును 'సాక్షి' వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

### సాఫీగా సాగుతున్న స్టోన్ క్రషింగ్



నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిలో క్రషర్ ఏర్పాటు చేయొద్దు. కానీ ఇక్కడ మాత్రం 326, 330, 311 సర్వే నంబర్లలోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో స్టోన్ క్రషింగ్ సాఫీగా సాగుతోంది. క్రషర్ కొనసాగుతున్నది ప్రభుత్వ భూమిలోనేనని 2021 మే 11న జక్రాన్‌పల్లి తహసీల్ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా ఇచ్చిన వివరాల్లో స్పష్టంగా ఉంది. పైగా 2018లో రెండుసార్లు రెవెన్యూ అధికారులు సర్వే సైతం చేయించగా, క్రషర్ కొనసాగుతున్న భూమి పూర్తిగా ప్రభుత్వానిదేనని తేలింది. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు.

## అక్కడ వ్యూహం.. ఇక్కడ అమలు

- మళ్లీ వచ్చేసిన సిండికేట్..
- ఎర్రజొన్న ధరల తగ్గింపు
- మరోసారి మోసపోతున్న రైతన్న

**ఆర్మూర్:** ఎర్రజొన్న, తెల్లజొన్న సాగు చేసిన రైతులు ముందునుంచి భయపడుతోందే జరిగింది. సిండికేట్‌గా మారిన వ్యాపారులు తాము నిర్ణయించేదే ధర అని కరాఖండిగా చెబుతున్నారు.ఇటీవల గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఓ వ్యాపారి ఇంట్లో వివాహానికి హాజరైన ఇక్కడి వ్యాపారులు ఓ హోటల్‌లో సమావేశమై జొన్నల ధరను నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ధరను ఎంత తగ్గించాలి.. తాము ఎలా లాభపడాలో చర్చించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఉత్తర భారతదేశంలో డిమాండ్ లేదనే సాకు చూపుతూ ధర తగ్గించి కొనుగోలు చేయడానికి దళారులతో సన్నాహాలు ప్రారంభించారు. విత్తనం సరఫరా సమయంలోనే రైతులు వ్యాపారులతో గిట్టుబాటు ధర, బై బ్యాక్ ఒప్పందం చేసుకోవాలన్న వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు అక్కడికే పరిమితమయ్యాయి. విత్తన వ్యాపారంపై రాష్ట్ర ప్రభుత్వ ఆధిపత్యం లేకపోవడంతో ప్రతి ఏడాది ఈ పరిస్థితి ఉంటోంది. జొన్న రైతులు మోసపోతూనే ఉన్నారు. గతేడాది ఎర్రజొన్న క్వింటాల్‌కు రూ.4,500 ధర పలకగా, ఈ ఏడాది రూ.800 తగ్గించిన వ్యాపారులు రూ.3,700కు మాత్రమే కొంటామని చెబుతుండడంతో చేసేది లేక రైతులు అమ్ముకుంటున్నారు. పంట చేతికి వచ్చిన తొలినాళ్లలో వేల్పూర్, మోర్తాడ్ మండలాల్లో క్వింటాల్‌కు రూ.4వేల చెల్లించినప్పటికీ క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. అదేవిధంగా తెల్లజొన్నలను సైతం మొదట్లో క్వింటాల్‌కు రూ.3,700కు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు.



ఆర్మూర్ ప్రాంతంలో సాగవుతున్న ఎర్రజొన్న

**నగదు కావాలంటే మరింత నష్టపోవాల్సిందే..**

ఎర్రజొన్నలను రూ.3,700 కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. రైతులు నగదు కావాలంటే రూ.3,550 మాత్రమే చెల్లిస్తున్నారు. వారం, పది రోజులు గడువు ఇస్తే రూ.3,700 చెల్లిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా భయపడుతున్న రైతులు తక్కువ ధర అయినా సరే తమకు నగదు కావాలని అంటున్నారు.

**తగ్గిన దిగుబడి**

జిల్లాలో సుమారు 45 వేల ఎకరాల విస్తీర్ణానికి పైగా భూమిలో ఎర్రజొన్న సాగుచేస్తున్నారు. గతేడాది ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది కేవలం 15 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల మధ్యే వస్తోంది. ఓ వైపు దిగుబడి లేక మరో వైపు ధర లేక రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు.

## బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

- ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదు
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**మోపాల్ (నిజామాబాద్‌రూరల్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని నిలపకుండా బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షాసమావేశాన్ని సోమ వారం నగర శివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలో 56వేల ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు జాబ్ క్యాలెండర్‌నూ ప్రకటించిందన్నారు. ఆర్థికవ్యవస్థ దుర్భర పరిస్థితుల్లో ఉన్నా రుణమాఫీ, బోనస్, రైతు భరోసా ఇతర పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బీజేపీ మతం పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకొంటోందని, దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబం గురించి ఆ పార్టీ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కులగణనను విమర్శించే నైతిక హక్కు బీ జేపీ, బీఆర్ఎస్‌కు లేదన్నారు. బీఆర్ఎస్ సర్వే కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీలు 5 శాతం పెరిగారని, 3 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొంటే బీసీల శాతం పెరిగే అవకాశం ఉందన్నా రు. సర్వేకు పార్లమెంట్‌లో ఆమోదం తెలపకపోతే రాజకీయంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

**తెలంగాణకు తీరని అన్యాయం..**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని జూపల్లి కృష్ణారావు విమర్శించారు. తెలంగాణ నుంచి అత్యధిక ఆదాయాన్ని కేంద్రానికి అందిస్తున్నా బడ్జెట్‌లో రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, బయ్యారం గనులకు నిధులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రులను ఓట్లు అడిగే హక్కు, కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేదన్నారు. కాంగ్రెస్ గురించి కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడితే నవ్వుకుంటున్నారని, మిగులు బడ్జెట్ ఇచ్చారనడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ఆర్ భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఏనుగు రవీందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, అన్వేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీలు మురళీనాయక్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చెర్మన్ ముప్ప గంగారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, నేతలు కైలాస్ శ్రీనివాస్, నగేశ్ రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మళ్లీ కంటి పరీక్షలు

- జీజీహెచ్, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రుల్లో..
- ఆర్‌బీఎస్‌కే వాహనాల్లో తరలింపు
- 15 రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం
- మొదటి రోజు 414 మందికి..

**నిజామాబాద్‌నాగారం:** పాఠశాల విద్యార్థుల్లో దృష్టిలోపాలను నివారించే లక్ష్యంతో కంటి పరీక్షల కార్యక్రమం సోమవారం నుంచి మళ్లీ ప్రారంభమైంది. గతేడాది ఏప్రిల్, ఆగస్టు నెలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. 5,124 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు అప్పట్లో వైద్యులు నిర్ధారించారు. గతంలో గుర్తించిన వారితోపాటు ప్రస్తుతం కంటి సమస్యలు ఉన్న వారికి మార్చి 5వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని జీజీహెచ్, ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. మొదటి రోజు జీజీహెచ్‌లో 312 మందికి, ఆర్మూర్‌లో 102 మందికి మొత్తం 414 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులకు సమస్య ఉన్నట్లు గుర్తించారు. 15 రోజులపాటు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేయనున్నారు. నిర్ణీత తేదీల్లో విద్యార్థులను ప్రతిరోజూ ఆర్‌బీఎస్‌కేకు చెందిన వాహనాల్లో ఆస్పత్రులకు తీసుకెళ్లనున్నారు.



ఆర్మూర్‌లో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

### పౌష్టికాహారం తీసుకోవాలి

**ఆర్మూర్‌టౌన్:** విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సోమవారం విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా ప్రభు త్వ ఆస్పత్రితోపాటు ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.అంతకుముందు ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులు భుజంగ్‌రావు, అమృత్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రెండు విడతల్లో 89,263 మందికి..

ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా గతేడాది రెండు విడతల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 89,263 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 5,124మంది విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### కళ్లద్దాలు పంపిణీ చేస్తాం



కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గతంలో గుర్తించిన 5,124 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. మళ్లీ కంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా సైట్ ఏవిధంగా ఉందో తెలుస్తుంది. సైట్ ఆధారంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తాం. ఇంకా ఎవరైనా విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతుంటే కచ్చితంగా పరీక్షలు చేసి అవసరమైన అద్దాలు అందజేస్తాం.

– రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి

## రెవెన్యూ రికవరీపై హైకోర్టుకు వెళ్తాం

- వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి
- సివిల్ సప్లయీస్ కార్యాలయంలో బియ్యం మిల్లుల రికార్డుల పరిశీలన

**సుభాష్‌నగర్:** సమాచార సేకరణ అనంతరం ప్రభుత్వ ధనం రికవరీపై హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేస్తామని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో సోమవారం వినియోగదారుల మండలి జిల్లా ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మతో కలిసి బియ్యం మిల్లుల రికార్డులను పరిశీలించారు.

జిల్లాలో 41 మంది మిల్లర్లు ప్రభుత్వానికి రూ.417 కోట్ల విలువైన బియ్యం బకాయిల విషయంలో అధికారులు తీసుకున్న చర్యలు, కేసుల నమోదు, కోర్టుల్లో నమోదు చేసిన సెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2014–15 నుంచి ఆరు మిల్లుల బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని, కేసులు కొనసాగుతున్నాయని తెలిపారు. మిగతా మిల్లులపై అధికారులు కఠిన చర్యలు చేపట్టకుండా, ఇటీవల కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. అనేక మంది మిల్లర్లు అధికారుల నోటీసులపై హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేసి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్–1864 ప్రకారం ఒక్కో మిల్లుపై ఒక్కో రీతిలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, చట్టాల్లోని లొసుగులతో తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. రూ.417 కోట్ల ప్రభుత్వ ధనం రికవరీ కోసం పాత చట్టాలపై ఆధారపడకుండా, వినియోగదారుల మండలి ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లో ఫిర్యాదు చేసిందని గుర్తుచేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న సాంబరాజు చక్రపాణి

## క్లుప్తంగా

### చట్టంలోని లొసుగులతోనే రైతులకు అన్యాయం



మోర్తాడ్‌: చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకొని విత్తనోత్పత్తి కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ సుంకెట్‌ అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. భీమ్‌గల్‌ మండలం పల్లికొండలో పొట్ట దశకు రాని వరి పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. నాసిరకం విత్తనాలను విక్రయించిన సీడ్‌ కంపెనీపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కంపెనీల లేబుల్‌ను పరిశీలించిన తర్వాతే విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ సీడ్‌ కంపెనీలు విక్రయించే విత్తనాలతోనే మేలు చేకూరుతుందని తెలిపారు. ఆయన వెంట భీమ్‌గల్‌ వ్యవసాయాధికారి అరవింద్‌, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నాయకులు జేజే నర్సయ్య, అనంతరామ్‌, గంగాధర్‌, రాజేష్‌, కిషన్‌, నవీన్‌, ప్రవీణ్‌ ఉన్నారు.

# రూ. 50 వేలకు మించి తీసుకెళ్లొద్దు

- ఆధారాలు చూపకుంటే నగదు సీజ్‌
- అమలులో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి
- సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం



ఖలీల్‌వాడి: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులో ఉంది. అభ్యర్థుల ప్రచారాలు, హడావుడి అంతగా లేకపోవడంతో ఎన్నికల కోడ్‌ విషయం చాలా మందికి తెలియడం లేదు. చాలా చోట్ల సాధారణ రోజుల మాదిరిగానే నగదును తీసుకొని ప్రయాణిస్తున్నారు. ప్రజలు రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా ఆధారాలు ఉండాలని, లేకపోతే సీజ్‌ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కరీంనగర్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌, మెదక్‌ ఉమ్మడి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56, టీచర్‌ ఎమ్మెల్సీకి 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్‌ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌ దగ్గర పడుతుండటంతో ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు ప్రలోభాలకు తెర తీసినట్లు తెలిసింది. దీంతో ఎన్నికల అధికారులు నగదు తరలింపు, ఇతర వ్యవహారాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు దృష్టి సారించారు.

**ఆధారాలు లేకపోతే సీజ్‌**

ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ. 50 వేల నగదుకు మించి తీసుకువెళితే సంబంధిత ఆధారాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే వాటిని సీజ్‌ చేసే అధికారం అధికారులకు ఉంటుంది. బ్యాంక్‌ నుంచి విత్‌ డ్రా చేసిన నగదు, అప్పుగా, పంటలు అమ్మిన వచ్చిన డబ్బులతోపాటు బంగారం, వెండి కొనుగోలు చేసినా వాటికి ఇచ్చే రసీదులను వెంట ఉంచుకోవాల్సిందే. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌ ఉండటంతో బంగారం, వెండి, చీరలు ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేసినా వాటికి సంబంధించిన రసీదులను వెంట పెట్టుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**సరిహద్దుల్లో కట్టుదిట్టం**

జిల్లాకు సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి నిత్యం వేలాది మంది నిజామాబాద్‌తోపాటు కామారెడ్డి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ, ప్రైవేట్‌ బస్సులు, కార్లు, వాహనాలను చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు తనిఖీ చేస్తున్నారు. సరైన ఆధారాలు చూపని నగదు, సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగదు తీసుకెళ్లే వారు ఏమరుపాటుగా ఉండకుండా జాగ్రత్త వహిస్తూ ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని, లేకపోతే నగదు సీజ్‌ అయ్యే ఆస్కారం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**సరైన ఆధారాలు ఉండాలి**

కోడ్‌ అమలులో ఉన్నందున ఎన్నికల సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరం చేశాం. పెళ్లిళ్లు, పంట విక్రయాలు చేసేవారు నగదు తీసుకువెళ్లేటప్పుడు తప్పనిసరిగా రసీదులు, ఆధార పత్రాలను వెంట ఉంచుకోవాలి. రూ.50 వేల నుంచి రూ.10 లక్షల లోపు నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. సరైన ఆధారాలు చూపిస్తే ఎన్నికల అధికారుల ద్వారా తిరిగి అందజేస్తాం.

– రాజావెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్‌

# వైభవంగా పద్మనాభస్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్కాపూర్‌ (ఏ) గ్రామంలోగల అనంత పద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ కమిటీ, గ్రామస్తులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాసర పుణ్యక్షేత్రం వైపు వెళ్లే భక్తులకు రూరల్‌ పరిధిలో రామడుగు, ఖిల్లా డిచ్‌పల్లితోపాటు మల్కాపూర్‌ (ఏ) గ్రామంలో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయాన్ని టూరిజం హబ్‌గా మారుస్తామన్నారు. అలాగే మల్కాపూర్‌ (ఏ) గ్రామం నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డుతోపాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్‌ ఏఎంసీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్‌ ప్రతినిధులు శేఖర్‌గౌడ్‌, బాగిర్తి బాగారెడ్డి, అగ్గు భోజన్న, గుండారం పీఏసీఎస్‌ చైర్మన్‌ దాసరి శ్రీధర్‌, అమృతపూర్‌ గంగాధర్‌, శ్రీనివాస్‌, నవీన్‌గౌడ్‌ పాల్గొన్నారు.

## రోడ్డు మార్గం కోసం వినతి



ఆర్మూర్‌: పెర్కిట్‌–కొటార్మూర్‌ శివారులోని రైల్వే లైన్‌ అవతల ఉన్న తమ పంట పొలాలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేయించాలని కొటార్మూర్‌, మామిడిపల్లి గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు వారు సోమవారం పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు ఆధ్వర్యంలో నిజామాబాద్‌ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కోటర్మూర్‌ శివారులో ఏర్పాటు చేసిన రైల్వేస్టేషన్‌, రైల్వేలైన్‌ కారణంగా సుమారు 300 ఎకరాల భూములకు రోడ్డు మార్గం లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. రైల్వే లైన్‌ క్రాసింగ్‌ ఏర్పాటు చేస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని విన్నవించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ లింగాగౌడ్‌, రైతులు రుక్మాజీ, వేంపల్లి పోశెట్టి, చిన్న రాజన్న, లక్కారం పోశెట్టి, మల్యాల పోశెట్టి, దొనకంటి సాయిరెడ్డి, రమేష్‌ రెడ్డి, సాగర్‌ తదితరులున్నారు.

## నిరంతర విద్యుత్‌ సరఫరా లక్ష్యం



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): నిరంతర విద్యుత్‌ సరఫరానే టీజీఎన్‌పీడీసీఎల్‌ ముందున్న ఏకైక లక్ష్యమని ఎస్‌ఈ ఆర్‌ రవీందర్‌ అన్నారు. మోపాల్‌ మండలంలోని మంచిప్ప సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వాక్యూ మ్‌ సర్క్యూట్‌ బ్రేకర్‌ (వీసీబీ)ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాక్యూమ్‌ సర్క్యూట్‌ బ్రేకర్‌ ఏర్పాటుతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని పేర్కొన్నా రు. గతంలో రెండు ఫీడర్లు కలిపి ఉండేవని, ప్రస్తుతం కొత్త వీసీబీ ఏర్పాటు చేయడంతో విద్యుత్‌ సరఫరాలో ట్రిప్పింగ్‌ సమస్యను నివారించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్‌ రమేశ్‌, డీఈ ఆపరేషన్స్‌ ఉత్త మ్‌ జాడే, ఏడీఈ బాలేశ్‌కుమార్‌, ఏఈ నాగశర్వాణి, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌, మహిపా ల్‌, లైన్‌మెన్‌ విష్ణు, సిబ్బంది సంజీవ్‌, గ్రా మాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాతృ మరణాల నివారణకు కృషి చేయండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో మాతృ మరణాల నివారణకు ఆశా కార్యకర్త నుంచి జిల్లా ప్రోగ్రాం అధికారుల వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. నగరంలో సోమవారం ఆమె జిల్లాలోని ఎంసీహెచ్‌ పర్యవేక్షణ అధికారులకు, ఎంసీహెచ్‌ పోర్టల్‌ నిర్వాహకులకు సమీక్ష, శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. గృహ సందర్శనలో ఆశా కార్యకర్తలు ఏఎన్‌ఎంలు, పర్యవేక్షణ అధికారులు ప్రమాదకరమైన లక్షణాలు గల గర్భిణులను ముందే గుర్తించి వారిని ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు మాతృ మరణాలు జరిగినప్పుడు వారికి సంబంధించిన డాక్యుమెంట్స్‌, రిపోర్ట్స్‌ అన్నింటిని ఆన్‌లైన్‌లో అప్లోడ్‌ చేయాలన్నారు. అధికారులు సుప్రియ, స్వామి, సులోచన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



మాట్లాడుతున్న బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి

నిజామాబాద్‌ అర్బన్‌ : విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాకతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కళాశాలలో స్కిల్‌ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు బోధించిన పాఠాలే కాకుండా చదువుతోపాటు నైపుణ్య కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్‌ రజినీకాంత్‌, ప్రిన్సిపల్‌ ఫరీదుద్దీన్‌, ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బీన్‌ హందాన్‌, నుడా చైర్మన్‌ కేశవ వేణు, అగ్రికల్చరల్‌ బోర్డు మెంబర్‌ గడుగు గంగాధర్‌, గ్రంథాలయ చైర్మన్‌ అంతిరెడ్డి రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### చోరీ కేసులో ముగ్గురి రిమాండ్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌): చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్‌ పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన బచ్చుసింగ్‌ బాగ్రియా కుటుంబంతో కలిసి బతుకు దెరువు కోసం 15 రోజుల క్రితం బోధన్‌కు వచ్చాడు. స్థానికంగా బొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల బాగ్రియా తన వద్ద ఉన్న రూ. 40వేల నగదును సమీప బ్యాంక్‌లో డిపాజిట్‌ చేయడానికి వెళ్లాడు. బ్యాంక్‌ బంద్‌ ఉండటంతో అతడు తిరిగి తన ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో సాత్‌పూల్‌ కల్లుబట్టి వద్ద ముగ్గురు వ్యక్తులు కలిసి, కల్లుబట్టిలోకి తీసుకువెళ్లారు. కల్లు తాగిన అనంతరం బాగ్రియాను సదరు వ్యక్తులు బెదిరించి రూ. 40వేల నగదును తీసుకొని పారిపోయారు. మరుసటి రోజు బాగ్రియా పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా కొత్త బస్టాండ్‌ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్‌ మహ్మద్‌, వసీం, సయ్యద్‌ సజ్జన్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా బాగ్రియా వద్ద తామే డబ్బులు తీసుకున్నామని అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 10,500 నగదును స్వాధీనం చేసుకొని, అరెస్ట్‌ చేసి రిమాండ్‌ తరలించినట్లు సీఐ వెల్లడించారు.

### పొక్లెయిన్‌, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామంలో కప్పలవాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న పొక్లెయిన్‌, రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై రామ్‌ తెలిపారు. పొక్లెయిన్‌, ట్రాక్టర్లు తాళ్లపల్లి వెంకగౌడ్‌కు చెందినవని ఆయన తెలిపారు. వాహనాలను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. తదుపరి విచారణ కోసం వాహనాలను మైనింగ్‌ శాఖకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

**మోపాల్‌ మండలంలో..**



మోపాల్‌: మండలంలోని కాస్‌బాగ్‌తండాకు చెందిన హరిసింగ్‌ అనుమతులు లేకుండా ఆదివారం అర్ధరాత్రి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**పోతంగల్‌ మండలంలో..**

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం కారేగాం శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ సోమవారం తెలిపారు. ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రెండు రోజుల జైలు

బోధన్‌టౌన్‌(బోధన్‌): వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్షను బోధన్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ విధించినట్లు పట్టణ సీఐ నారాయణ సోమవారం తెలిపారు. ఇటీవల పట్టణానికి చెందిన షేక్‌ జలాల్‌ మద్యం తాగి వాహనం నడుపగా పోలీసులకు పట్టుబడ్డాడు. అలాగే మరోవ్యక్తి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా అతడిని పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని బోధన్‌ కోర్టులోని సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరుచగా జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.



## క్రైం కార్నర్‌

### చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రం శివారులోని చెరువులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌ కేసు నమోదు చేసుకుని శవాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 30–35ఏళ్లు ఉంటుందని, బూడిద కలర్‌ చొక్కా, గోధుమ కలర్‌ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే ముప్కాల్‌ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని ఆర్మూర్‌ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

**నగం కాలినస్థితిలో ఒకరి మృతదేహం..**

ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులోగల అటవీప్రాంతంలో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం సగం కాలిన స్థితిలో లభ్యమైంది. మృతుడు జిల్లాకేంద్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని బీడీ కాలనీకి చెందిన సందీప్‌(28) ఈనెల 15న అదృశ్యమయ్యాడు. 5వ టౌన్‌ పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందల్వాయి పోలీసులకు సగం కాలిన స్థితిలో ఉన్న మృతదేహం లభించగా, దుస్తులు, ఇతర ఆనవాళ్ల ఆధారంగా సందీప్‌గా 5వ టౌన్‌ పోలీసులు గుర్తించారు. కేబుల్‌ ఆపరేటర్‌గా పని చేస్తున్న అతడిని స్నేహితులే శనివారం ఆటోలో తీసుకెళ్లినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించామని, కేసు విచారణ చేస్తున్నామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని ఐదో టౌన్‌ ఎస్సై గంగాధర్‌ తెలిపారు.

### భిక్కనూరులో బైక్‌ చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల ఓ బైక్‌ చోరీకి గురైందని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండి సిద్దగిరి ఈనెల 14న తన ఇంటి ముందర బైక్‌ పెట్టి, ఇంట్లోకి వెళ్లాడు. గంటన్నర తర్వాత బయటకు వచ్చి చూడగా బైక్‌ కనిపించలేదు. ఈ విషయమై బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

**నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో..**

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ ఎదుట నిలిపిన ఓ బైక్‌ చోరీకి గురైనట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. నగరానికి చెందిన రాజ్‌కుమార్‌ అనే వ్యక్తి జనవరి 31న తన బైకును రైల్వేస్టేషన్‌ ముందు పార్క్‌ చేసి హైదరాబాద్‌ వెళ్లాడు. తిరిగి ఈనెల 2న అతడు వచ్చేసరికి రైల్వేస్టేషన్‌లో పార్క్‌ చేసిన బైక్‌ కనబడలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**జగదాంబ ఆలయంలో..**



నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గొల్లగొట్టతండాలోగల సేవాలాల్‌ జగదాంబ ఆలయంలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి అమ్మవారి ముక్కుపుడుక, పుస్తెలు ఎత్తుకువెళ్లారని రూరల్‌ ఎస్సై–2 ఆనంద్‌ సాగర్‌ తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### నమ్మకంగా ఉంటూనే దోచేశారు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ వైద్యురాలి వద్ద ఇద్దరు వ్యక్తులు కొన్ని నెలలుగా పనులు చేస్తూ, నమ్మకంగా ఉంటూ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. ఖలీల్‌వాడిలోని భాగ్య అనే వైద్యురాలి వద్ద రాజు, పవన్‌ అనే ఇద్దరు వ్యక్తులు కొన్ని నెలలుగా పనిచేస్తుండేవారు. నమ్మకంగా ఉండటంతో వైద్యురాలు వారికి ఇంటి తాళాలను ఇచ్చింది. ఈక్రమంలో ఇద్దరు కలిసి ఆరు నెలలుగా విడతల వారీగా 35 తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలిసిన వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### టీచర్‌పై పోక్సో కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు రమేష్‌పై సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా విద్యార్థిని తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు అసభ్యకర మెసేజ్‌లు పంపాడు. దీంతో విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**మేకను గావుపట్టిన వారిపై..**

బాల్కొండ: మండల కేంద్రంలో ఈ నెల 12న మల్లన్న ఆలయ ఉత్సవాల్లో మేక పిల్లను గావుపట్టిన వారిపై బాల్కొండ పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. జంతు సంరక్షణ సమితికి చెందిన గౌతమ్‌, శ్రీవిద్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

# విషాదాన్ని మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- స్తంభాన్ని ఢీకొన్న బైక్‌.. ఇద్దరి మృతి



సోహెల్‌ (ఫైల్‌)



సుమేర్‌ (ఫైల్‌)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న భీంగల్‌ సీఐ, మోర్తాడ్‌ ఎస్సై

మోర్తాడ్‌(బాల్కొండ): నిజామాబాద్‌ జిల్లా మోర్తాడ్‌ మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బైక్‌పై వెళ్లిన ఇద్దరు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. తిమ్మాపూర్‌కు చెందిన సోహెల్‌(26) బతుకుదెరువు కోసం బహ్రెయిన్‌ వెళ్లి, రెండు రోజుల క్రితం సొంతూరుకు వచ్చాడు. అతడిని, కుటుంబ సభ్యులను కలవడంకోసం సమీప బంధువు జగిత్యాల జిల్లా యూసుఫ్‌నగర్‌కు చెందిన మహమ్మద్‌ సుమేర్‌(21) తన బైక్‌పై తిమ్మాపూర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం సోహెల్‌, సుమేర్‌ ఇద్దరు కలిసి బైక్‌పై పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్‌ ఎస్సై విక్రమ్‌ ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ఆస్పత్రికి తరలించారు.

**భార్య, కూతురును చూడకుండానే..**

సోహెల్‌ భార్య ఆర్మూర్‌ మండలం మామిడిపల్లిలోగల తన తల్లి వద్ద ఉంటోంది. నాలుగు రోజుల క్రితమే కూతురు మొదటి పుట్టిన రోజు జరిగింది. రెండు రోజుల క్రితం బహ్రెయిన్‌నుంచి వచ్చిన సోహెల్‌.. త్వరలోనే భార్య, కూతురును ఇంటికి తీసుకువెళ్లాలనుకున్నాడు. అంతలోనే రోడ్డు ప్రమాదం జరిగి భార్య, కూతురును చూడకుండానే సోహెల్‌ మృతిచెందాడు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఇందల్వాయి: మండల కేంద్రంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన వేముల గంగాధర్‌(55) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌ కుమార్‌ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ వాటర్‌ ప్లాంట్‌లో పని చేస్తున్న గంగాధర్‌ పని ముగించుకొని హోటల్‌కి వెళుతుండగా ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించామని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కాలువలో పడి రైతు మృతి



చిన్నయ్య (ఫైల్‌)

బాల్కొండ: కాకతీయ కాలువలోని పంపుసెట్‌లో చెత్తను తొలగించడానికి నీటిలోకి దిగిన ఓ రైతు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ముప్కాల్‌ ఎస్సై రజనీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా.. ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన రైతు కోమటిశెట్టి చిన్నయ్య(46) కాకతీయ కాలువ నీటి ఆధారంగా పంపుసెట్‌ ఏర్పాటు చేసుకొని, ఆ నీటితో పొలం సాగుచేసేవాడు. పంపుసెట్‌లో చెత్త పేరుకుపోవడంతో తొలగించడానికి ఆదివారం సాయంత్రం అతడు ఇంటినుంచి బైక్‌పై బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం అతడి కుటుంబ సభ్యులు కాలువ వద్దకు వెళ్లారు. అక్కడ అతడి బైక్‌ ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు కాలువలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం చిన్నయ్య మృతదేహం లభ్యమైంది. చిన్నయ్య పంపుసెట్‌లోని చెత్తను తొలగించడానికి కాలువలోకి దిగి, ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

**చికిత్సపొందుతూ ఒకరు..**

నిజాంసాగర్‌(జుక్కల్‌): చెట్టు పైనుంచి పడి గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన బేగరి లింగయ్య (31) ఆదివారం మేకలను మేత కోసం పంటపొలాల వైపు తీసుకువెళ్లాడు. ఈక్రమంలో అతడె పొలాల గట్టుపైన ఉన్న చింతచెట్టు ఎక్కి కొమ్మలను నరుకుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైద్రాబాద్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఐశ్వర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్‌ తెలిపారు.

### కలుషిత నీరు తాగి తొమ్మిది మేకలు మృతి



మాచారెడ్డి: కలుషిత నీటిని తాగి తొమ్మిది మేకలు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని లచ్చాపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుల్లె దేవయ్యకు చెందిన మేకలు గ్రామ శివారులోని రైస్‌మిల్లు సమీపంలో మేస్తుండగా, రైస్‌మిల్లు నుంచి వెలువడిన కలుషిత నీటిని తాగాయి. దీంతో మేకలు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపారు. ఈమేరకు పశువైద్యాధికారితో పోస్టుమార్టం చేయించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. చనిపోయిన మేకల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### తలమడ్లలో ఒకరు..



సాయికుమార్‌ (ఫైల్‌)


రాజంపేట: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పుష్పరాజ్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తలమడ్ల గ్రామానికి చెందిన కోదండమ్‌ సాయికుమార్‌(18) తూప్రాన్‌లో ఐటీఐ చదువుతున్నాడు. ఇటీవల తలమడ్ల గ్రామానికి వచ్చిన సాయికుమార్‌ శనివారం అకస్మాత్తుగా గడ్డిమందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని అశ్విని హాస్పిటల్‌కు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతికి గల కారణాలు తెలియలేదని విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

### కోళ్లకు వైరస్‌.. సజీవంగా పూడ్చివేత



బాన్సువాడ రూరల్‌ (బాన్సువాడ): బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన దామరంచ సాయిలు అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో 6వేల బ్రాయిలర్‌ కోళ్లను సజీవంగానే పూడ్చిపెట్టారు. గత మూడు రోజులుగా కోళ్ల అస్వస్థతకు గురికావడంతో కోళ్ల కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా వారు వైద్య పరీక్షలు జరిపి, కోళ్లకు వైరస్‌ సోకిందని నిర్ధారించారు. దీంతో వారి సూచనల మేరకు కోళ్లను సజీవంగా పూడ్చి వేశారు. కోళ్లకు వైరస్‌ సోకడంతో తాను తీవ్రంగా నష్టపోయినట్లు, సుమారు లక్షల నష్టం వాటిల్లిందని పౌల్ట్రీ రైతు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నాడు.

### తప్పిపోయిన వ్యక్తి.. వెతికి, పట్టుకున్న రైల్వేపోలీసులు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన షేక్‌బాబా అనే వ్యక్తిని, పట్టుకొని అతడి బంధువులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. నాందేడ్‌లోని శివాజీనగర్‌కు చెందిన షేక్‌ బాబా(58) ఈనెల 14న తన చిన్న కూతురు ఉంటున్న కరీంనగర్‌కు వెళ్లినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్‌ నుంచి నాందేడ్‌కు వెళుతున్న క్రమంలో నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడ నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. దీనిపై అతడి కూతురు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా షేక్‌బాబా ముత్‌ఖేడ్‌ రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడే ఉండిపోయినట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి పట్టుకొని బంధువులకు అప్పగించారు.